# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక, ఆదాయార్జన శాఖలపై ఈ రోజు సమీక్ష నిర్వహిస్తారు.**

**2. నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ నర్సాపూర్‌లో ఈ మధ్యాహ్నం ప్రారంభిస్తారు.**

**3. అంగన్వాడీ వ్యవస్థలో వేగవంతమైన సేవలు కోసం స్మార్ట్ ఫోన్ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

**4. భారతీయ రిజర్వు బ్యాంకు తాజాగా విడుదల చేసిన నివేదికలో రాష్ట్రం పలు రంగాల్లో మొదటి స్థానంలో నిలిచింది.**

**5. భారత దేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వర్ధంతి ఈరోజు.**

==========================

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని శంషాబాద్ కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని ఆరోగ్య, ధ్యాన కేంద్రాలతో సహా, యోగా కేంద్రాలను, వృక్ష సంరక్షణ, బయోచార్ కేంద్రంను పరిశీలించారు. అనంతరం శాంతి వనం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దా తో ముఖ్యమంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పర్యటన అనంతరం ముఖ్యమంత్రి అమరావతికి చేరుకుని ఆర్థిక, ఆదాయార్జన శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. అలాగే రియల్-టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీఎస్ ద్వారా ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్ర పారిశ్రామిక, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపూర్‌లో ఈ మధ్యాహ్నం ప్రారంభిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

-------------------------

అంగన్వాడీ వ్యవస్థలో వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పారదర్శకత కోసం స్మార్ట్ ఫోన్ వ్యవస్థను

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో అంగన్వాడీ కార్యకర్తలకు ఉచితంగా 5%+% సెల్ ఫోన్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాల స్థాయికి నవీకరిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు, త్రాగునీరు వంటి మౌలిక వసతులు, కల్పిస్తున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయీ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. అటల్ – మోడీ సుపరిపాలన యాత్రలో భాగంగా ఈరోజు నెల్లూరు నగరంలోని హరినాధపురంలో వాజ్ పేయీ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ లతో కలిసి ఆయన ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు ఎన్నో ప్రజా హిత సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఆయన అందించిన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈ రోజు ఏలూరులో పర్యటించారు. పర్యటనలో భాగంగా ఏలూరు తూర్పు వీధిలోని శ్రీ గంగానమ్మ దేవాలయంలో జరుగుతున్న జాతరలో పాల్గొన్నారు. హోంమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జాతర సందర్భంగా మేడలలో కొలువుదీరిన శ్రీ కొర్లపాటి అంకమ్మ, శ్రీ గంగానమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబులను దర్శించుకుని అమ్మవార్లకు సారే సమర్పించి హోం మంత్రి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

భారతీయ రిజర్వు బ్యాంకు – ఆర్బీఐ తాజాగా విడుదల చేసిన నివేదికలో రాష్ట్రం పలు రంగాల్లో మొదటి స్థానంలో నిలిచింది. 1 కోటి 93 లక్షల టన్నులతో పండ్ల ఉత్పత్తిలో దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం దక్కించుకుంది. అలాగే 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానం సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి –GSDP 15.93 లక్షల కోట్ల రూపాయలుగా నమోదైందని, తలసరి జీఎస్డీపీ 2.66 లక్షలుగా ఉందని తెలిపింది.మొత్తంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ 74 మార్కులతో దేశంలో 10వ స్థానంలో నిలిచింది.

---------------------------

ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ –ఎపి ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి సూర్య సాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విజయవాడలో నిర్వహించిన ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా

ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. వ్యవసాయ, గృహ అవసరాలకు సంబంధించి సౌరశక్తి విధానాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా అవగాహన కలిపిస్తున్నామని తెలిపారు.

---------------------------

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. తిరుపతిలో హెల్మెట్ అవగాహనా ర్యాలీని జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎస్పీ ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

భారత దేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంశాఖమంత్రి, ఉక్కు మనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వర్ధంతి ఈరోజు. 1875 అక్టోబర్ 31వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని నాడియాడ్‌లో జన్మించిన వల్లభ్ భాయ్ పటేల్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించారు. స్వాతంత్ర్య పోరాటం తీవ్రతరమవుతున్న దశలో న్యాయవాద వృత్తికి స్వస్తిపలికి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. స్వాతంత్ర్యం అనంతరం విడివిడిగా ఉన్న రాజసంస్థానాలను దేశంలో విలీనం చేయడంతో దేశాన్ని ఐక్యం చేయడం కోసం కృషి చేసిన వల్లభ్ భాయ్ పటేల్ 1950 డిశెంబర్ 15 తుది శ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్.. 25 సెకన్లు

=====================